www.prajasakti.com

ప్రజాశక్తి

ఆదివారం 2 నవంబర్ 2025

5

తిరుపతి



నేడు ఎల్‌వీఎం 3బిఎం5 ప్రయోగం



శనివారం సాయంత్రం 5:26 గంటల నుంచి కౌంట్‌డౌన్ ప్రారంభం

ప్రజాశక్తి-సూళ్లూరుపేట: భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ షార్ లోని రెండో ప్రయోగ వేదిక నుంచి ఆదివారం సాయంత్రం 5.26 గంటలకు ఎల్వీఎం 3బి ఎం 5 రాకెట్ ద్వారా సి ఎం ఎస్ 03 సమాచార ఉపగ్రహాన్ని షార్ నుండి ప్రయోగించేందుకు రంగం సిద్ధమైంది. ఎంఆర్ఆర్ సమావేశం నిర్వహించి ప్రయోగ పనులను లాంచ్ ఆథరైజేషన్ బోర్డు (ల్యాబ్) చైర్మన్ ఈ.ఎస్.పద్మ కుమార్ బృందానికి అప్పగించారు. ఆయన ఆధ్వర్యంలో లాంచ్ రిహాల్సర్స్ నిర్వహించి శనివారం సాయంత్రం 5.26 గంటలకు కౌంట్ డౌన్ ప్రారంభించారు. ఇది నిరంతరం 24 గంటలు కొనసాగినా అనంతరం ఆదివారం సాయంత్రం 5.26 గంటలకు 4400 కిలోల బరువు కలిగిన సిఎంఎస్ 03 కమ్యూనికేషన్ ఉపగ్రహాన్ని మోసుకుని నింగిలోకి దూసుకెళ్లనుంది. ప్రయోగం ప్రారంభమైన అనంతరం 16.09 నిమిషాల్లో పూర్తిచేసి ఉపగ్రహాన్ని నిర్దేశించిన కక్ష్యలోకి ప్రవేశపెడతారు.

తిరుపతి బాలోత్సవం

- బాలోత్సవానికి సహాయ సహకారాలు అందిస్తాం
- పిల్లలను పుస్తకాలకే పరిమితం చేయొద్దు
- చదువుతోపాటు ఆట, పాటలు అవసరం
- తెలుగు భాషను కాపాడుకుందాం : కలెక్టర్



గోవిందా.. గోవింద



సలామా లేకుం..



గంగమ్మ జాతరను తలపించిన చిన్నారుల వేషధారణ



బాలోత్సవం వేదికపై మాట్లాడుతున్న తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: బాలోత్సవం కార్యక్రమం చూస్తుంటే పిల్లల పండుగ వాతావరణం తనకు ఇక్కడ ఉట్టిపడుతుందని, చిన్న పిల్లలు వేసిన వివిధ రకాల వేషాలు, ఆటల పాటలు చూస్తుంటే తెలుగు భాష రక్షణ చెక్కుచెదరబోదని అనిపిస్తుందని జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు. శనివారం నాలుగవ బాలోత్సవం కార్యక్రమం తిరుపతి ఎస్‌జిఎస్ ఆర్ట్స్ కాలేజీలో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ బాలోత్సవ కమిటీ నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం తనకు ఎంతో నచ్చిందన్నారు. రానున్న రోజుల్లో బాలోత్సవ కార్యక్రమ నిర్వహించడానికి జిల్లా యంత్రాంగం నుంచి తగిన సహాయ సహకారాలు అందిస్తామని చెప్పారు. అవసరమైతే ఆర్థికంగా కూడా బాలోత్సవ నిర్వాహకు సహాయ సహకారాలు ఇస్తామన్నారు. ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం వల్ల సమాజానికి ఎంతో మేలు జరుగుతుందన్నారు.ముఖ్యంగా పిల్లల్లో మంచితనం పెంపొందించ చేయడు దోహదపడుతుం దన్నారు. పిల్లలు పుస్తకాలకే పరిమితం చేయకుండా వారికి క్రీడలతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు కూడా నేర్పించాల్సిన అవసరం ఉందని చెప్పారు. చిన్నప్పటినుంచి పిల్లలపై ఐఏఎస్ లు, ఐపీఎస్ లు చేయాలని పిల్లల తల్లితండ్రులు లేకుండా చదువులు చదివించాలని అన్నారు. బాలోత్సవ కార్యక్రమంలో 35 అంశాల్లో 75 కార్యక్రమం పెట్టడం అందులో తెలుగు భాష పై దృష్టి పెట్టడం అభినందనీయమన్నారు. కొన్ని పాఠశాలలు ఇంగ్లీష్ భాష పై ఎక్కువ ఫోకస్ పెడుతు న్నారని, దానివల్ల తెలుగు భాష మాట్లాడటం పిల్లలకి మర్చిపోయే పరిస్థితి ఉందన్నారు. పాఠశాలలో కూడా ఇంగ్లీష్ భాష పై ఫోకస్ పెట్టకుండా తెలుగు భాష పై కూడా పెట్టాలని సూచించారు. ప్రభుత్వం ఇంగ్లీష్ భాష పై కొంతవరకు ప్రాధాన్యత ఇస్తా ఉందని అది కేవలం ఉద్యోగ అవసరాల కోసమేనని అన్నారు. ఇంగ్లీష్ భాష నే స్కూల్లో మాట్లాడాలని నిబంధనలు పెట్టవద్దని సూచిం చారు. పిల్లలు తల్లిదండ్రులు కూడా ఇంట్లో ఇంగ్లీష్ భాష మాట్లాడాలని ఒత్తిడి చేయవద్దని వారికి తెలుగు భాష మీద కూడా మాట్లాడే స్వేచ్ఛను ఇవ్వాలన్నారు. తాను కూడా ఒకటో తరగతి నుంచి పదవ తరగతి వరకు తన తల్లిదండ్రులు హస్టల్లో వేయడం జరిగిందని తెలిపారు. ఒకటో తరగతి నుంచి చదువుతోపాటు క్రీడలు క్విజ్ సాంస్కృతిక కార్యక్రమాలు పై ఎక్కువ దృష్టి పెట్టే వాడినన్నారు. దానివల్ల తను పదవ తరగతి వచ్చేలోపు బాగా విజ్ఞానవంతుణ్ణి అయ్యానని గుర్తు చేశారు. సైన్స్ పట్ల కూడా ఆసక్తిగా చదవడం వల్లే తాను ఐఏఎస్ కి ప్రిపేర్ అవడం జరిగిందన్నారు. ముఖ్యంగా ఎనిమిది పదవ తరగతి పిల్లలు చదువు క్రీడలు పట్ల ఆసక్తి చూపాలని ఇతర అలవాట్లు జోలికి వెళ్లరాదని సూచించారు. చాలామంది పిల్లలు ఈ వయసులో ఇతర అలవాట్లు వల్ల వారి జీవితాలను నాశనం చేసుకోవద్దని హితవు పలికారు. బాలోత్సవ కార్యక్రమంలో తెలుగు దనం ఉట్టిపడుతుందని కొనియాడారు.

తిరుపతి బాలోత్సవం గౌరవ అధ్యక్షులు టెంకాయల దామోదరం మాట్లాడుతూ బాలలందర్నీ ఒక తాటిపై తీసుకువచ్చేందుకే బాలోత్సవ కార్యక్రమం నిర్వహిస్తున్నా మని చెప్పారు. ఇది 4వ బాలోత్సవం అని గుర్తు చేశారు. జిల్లావ్యాప్తంగా సుమారు 12 వేల మంది పిల్లలను ఒకే వేదికపై తీసుకువచ్చి పండగ వాతావరణంలో బాలోత్సవం నిర్వహించడం తమకెంతో ఆనందం కలిగిస్తుందన్నారు. గత ఏడాది కంటే ఈ ఏడాది అధిక సంఖ్యలో పిల్లలు వచ్చారని గుర్తు చేశారు. పిల్లల్ని తీర్చిదిద్దడానికి ఈ కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఇక్కడ సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు వ్యాసరచన, పోటీలు, క్రీడా పోటీలు ఇతర పోటీలు కూడా నిర్వహి స్తున్నామని తెలిపారు. ఇలాంటి పోటీలు నిర్వహించడం వల్ల పిల్లలు మంచి మార్గంలో నడవడానికి తోడ్పడుతుందని గుర్తు చేశారు.

తిరుపతి బాలోత్సవ వ్యవస్థాపకులు మల్లవరపు నాగార్జున మాట్లాడుతూ బాలోత్సవం అంటే చిన్న పిల్లలని చిన్నపిల్లలు అంటేనే బాలోత్సవమని అన్నారు. గత నాలుగు సంవత్సరాల నుంచి ఈ కార్యక్రమం పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నామని పిల్లలతో పాటు వారి తల్లిదండ్రుల ఆదరణ లభిస్తుందన్నారు. ఇటు పాఠశాల ఉపాధ్యాయులు కూడా ఈ బాలోత్సవాన్ని ఆదరించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలలో చదివే పిల్లలందరూ ఒకచోట వచ్చి ఈ పండుగ జరుపుకోవడం మన సంస్కృతి సాంప్రదా యాలు కాపాడుకోవడంలో కూడా ఒక కారణమన్నారు. పిల్లలు వివిధ రకాల వేషాలు ధరించి రావడంతో పండగ వాతావరణం ఉట్టిపడుతుందన్నారు. ఇలాంటి కార్యక్రమా లు ప్రజలు ఆదరించాల్సిన అవసరం ఉందన్నారు.

కస్తూరిబా ట్రస్ట్ చైర్మన్ పిసి రాయల్ మాట్లాడుతూ... బాలల దినోత్సవం అంటేనే పండుగాని, పండగ అంటేనే బాలోత్సవమని అన్నారు. ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం వల్ల మన పిల్లలు సెల్ ఫోన్లు, మీద మోజు తగ్గి క్రీడలు సాంస్కృతి కార్యక్రమాలతో మన సాంప్రదా యాన్ని కాపాడుకోవచ్చున్నారు. ఇలాంటి కార్యక్రమాలు పిల్లలకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు.

చైర్మన్, రీచ్ గ్లోబల్ ఫౌండేషన్ రమేష్ నాథ్ లింగుట్ల మాట్లాడుతూ బాలోత్సవం కార్యక్రమం గత నాలుగు సంవత్సరాలుగా విజయవంతంగా నిర్వహించడం ఎంతో ఆనందం కలిగిస్తుందన్నారు. ప్రస్తుత సమాజంలో పిల్లలు చెడిపోకుండా ఉండేందుకు ఈ బాలోత్సవం కార్యక్రమా లు ఎంతో ఆకట్టుకుంటున్నాయని, ఎందుకు పిల్లల తల్లితండ్రులు సహకరించడం అభినందనీయమన్నారు. బాలలను మంచి మార్గంలో పయనించేందుకు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం కమిటీ కే.గర్వకారణం అన్నారు.

సాంఘిక సంక్షేమ శాఖ ఉపసంచాలకులు కే విక్రమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. పిల్లలతో నిర్వహించే ఈ బాలోత్సవం తిరుపతి జిల్లాకు వన్నెతెచ్చిందన్నారు. బాలోత్సవ కమిటీ నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం ఎంతో అభినందనీయమన్నారు. ఇంతమంది పిల్లలను ఒకచోట తీసుకొచ్చి నిర్వహించడం అమోఘమని కొనియాడారు. బాలలు మంచి మార్గంలో నడవాలని, చెడుకు దూరంగా ఉండాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో డీఈవో కె వి ఎన్ కుమార్ ,ఎస్ ఎస్ ఆర్ జగన్నాథ రావు క్రియ పిల్లల పండుగ సెక్రటరీ కాకినాడ , తిరుపతి రోటరీ క్లబ్ అధ్యక్షులు రాజేంద్ర శెట్టి రోటరీ , ఎస్ జి ఎస్ ఆర్ట్స్ కాలేజ్ ప్రిన్సిపల్ సత్యనారాయణ పాల్గొన్నారు.

పోటీ అంశాలివే..అకడమిక్ విభాగంలో చిత్రలేఖనం, వక్తృత్వం, బొమ్మకు కథ, పద్యం-భావం, స్పెల్ బి (ఇంగ్లీషు), పదకేళి, కథ చెబుతా...ఊ కొడతారా, గణితం-తర్కం, లేఖా రచన తదితర అంశాల్లో పోటీలు వుంటాయి. సాంస్కృతిక, హస్త కళల విభాగాల్లో ఏకపాత్రలు, జానపద నత్యం, జానపద గీతాలు, దేశభక్తి గీతాలాపన, క్లాసికల్ డ్యాన్స్, ఫ్యాన్సీ డ్రెస్, శాస్త్రీయ సంగీతం, కోలాటం, ఇన్ స్ట్రుమెంట్, మట్టితో బొమ్మలు తదితర అంశాల్లో విద్యార్థులు పోటీపడతారు. ఇంకా క్రీడా విభాగంలో చెస్ పోటీలు వుంటాయి. ఈ పోటీల్లో విజేతలను నిర్ణయించడానికి ఆయా రంగాల్లో నిపుణులైన వారు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించనున్నారు.

చిత్రలేఖన పోటీలకు విశేష ఆదరణ.. బాలోత్సవం కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో చిన్న పిల్లలు తరలి రావడంతో మొదటగా డ్రాయింగ్ ఫోటోలు ప్రారంభించారు. తర్వాత చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు జిల్లా వ్యాప్తంగా పెద్ద సంఖ్యలో పిల్లలు హాజరై పాల్గొనడం జరిగింది. ఈ పోటీల్లో న్యాయ నిర్ణయాలతో పాటు ఉపాధ్యాయులు కూడా హాజరై పర్యవేక్షించడం జరిగింది. వివిధ అంశాల్లో పలు వేదికల ద్వారా పలు రకాల పోటీలు ప్రారంభమయ్యాయి ఎస్ జి ఎస్ ఆర్ట్స్ కాలేజ్ మొత్తం ఎటు చూసినా విద్యార్థులతో సందడి కలిగింది. ఒక పక్క శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు, దాన్ని అనుకునే దేశభక్తి గీతాలాపన మరో పక్క జానపదాల ప్రదర్శనలు జరిగాయి.

ఆకట్టుకున్న పిల్లల వేషాధారణ... తిరుపతిలో బాలోత్సవం కార్యక్రమంలో పిల్లలు వివిధ రకాల వేషాలు ధరించి అందర్నీ ఆకట్టుకునేలా చేశారు. ముఖ్యంగా స్వాతంత్ర సమరయోధుల వేషాలతో పాటు మన సంస్కృతి సాంప్రదాయ వేషాలు, తెలుగు భాష సంబంధించిన వేషాదరణ పాటు పర్యావరణ పరిరక్షణ, సైన్సు, ఇతర వేషాలో ఎంతో ఆకట్టుకునేలా వేసుకుని రావడంతో జిల్లా కలెక్టర్ వారితో కలిసి ఫోటోలు తీసుకోవడం జరిగింది.

మఠాన్ని పాత తరహాలోనే పునర్నిర్మిస్తాం


- మొత్తంగా కూల్చివేస్తారనే అపోహలు వద్దు
- మరమ్మతుల ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపుతాం : కలెక్టర్



సమావేశంలో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, కలెక్టర్ వెంకటేశ్వర్, కమిషనర్ మౌర్య

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: హథిరాం జీ మఠాన్ని పూర్వం ఉన్న భవనం లాగా, పాత తరహాలోనే పునర్నిర్మి స్తామని, హాథిరాంజీ మఠంలో బం జారాలకు మొదటి ప్రధాన్యతతో వారికి కావలసిన సదుపాయాలు కల్పిస్తామని జిల్లా కలెక్టర్ డా.ఎస్ వెంకటేశ్వర్ తెలిపారు. శనివారం స్థానిక కలెక్టరేట్ వీడియో కాన్ఫ రెన్స్ హాల్‌లో హాథిరాంజీ మఠం పునర్నిర్మాణం కొరకు ప్రతిపాదనలను త్వరితగతిన సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపాలని స్థానిక తిరుపతి శాసనసభ్యులు ఆరణి శ్రీనివాసులు, మున్సిపల్ కమిషనర్, ఇంచార్జ్ జిల్లా జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్యలతో కలిసి జిల్లా కలెక్టర్ మఠం కమిటీ సభ్యులతో సమీక్ష సమావేశం నిర్వహించి సంబందిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా స్థాయి కమిటీ సూచనల మేరకు ఒక ఎక్స్‌పర్ట్ కమిటీని నియమిస్తూ వారి సూచనలు తీసుకున్నామన్నారు. మఠం భవనం గాంధీ రోడ్డు వైపున ఉన్న భాగం మాత్రమే శిథిలమయిందని, హాథిరాంజీ మఠమును మొత్తంగా 10 జోన్లుగా విభజిస్తే అందులో ఉత్తరం వైపున ఉన్న రోడ్డు మొదటి అంతస్తు భాగం పూర్తిగా శిధిలమైదని తెలిపారు. తిరుపతి ఐఐటి డైరెక్టర్ ప్రసన్న కుమార్, స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్ట్ డైరెక్టర్ ఆర్.ఎన్,ఎస్ మూర్తి విజయవాడ వారు ఈ విషయం స్పష్టం చేశారని తెలిపారు. కారిడార్ కూడా ధ్వంసమయిందని రూఫ్ కూడా చాల వరకు పాడయిందని అన్నింటినీ పునర్నిర్మాణం చేయవచ్చని పరిశీలించి తెలిపారన్నారు. పూర్వం దీనిని మద్రాస్ టెర్రస్ రూఫింగ్ టెక్నాలజీని ఉపయోగించి నిర్మించారని, అదే తరహాలో ఇప్పుడు పునర్నిర్మాణం చేయవచ్చని తెలిపారు. ఇందులో కేవలం సున్నపు మోర్టారు, చెక్క, ఇటుకలను మాత్రమే ఉపయోగిస్తారని, ఇందులో సిమెంటు, కాంక్రీటు మరేవి లేవని తెలిపారు. ప్రస్తుతం ఉన్న సాంకేతిక పరిజ్ఞానం ప్రకారం దీనిని రెయిన్ ఫారెస్ట్ సిమెంట్ కాంక్రీట్ అని పిలుస్తామన్నారు. త్వరితగతిన పునర్నిర్మాణం చేసి బంజారాలకు సంబంధించి భక్తులకు వసతి సౌకర్యం, వ్యాపారస్తులకు కూడా వారి సౌకార్యార్థం దుకాణాలను అందుబాటులోనికి తిసుకోస్తామని తెలిపారు. ఈ సమావేశంలో తిరుపతి ఆర్.డి.ఓ రామ్మోహన్, శ్రీ కాళహస్తి ఈ.ఓ బాపి రెడ్డి, ఆంధ్ర ప్రదేశ్ గ్రీన్ అండ్ బ్యుటిఫికేషణ్ కార్పోరేషన్ చైర్మన్ సుగుణమ్మ, యాదవ కార్పోరేష చైర్మన్ నరసింహ యాదవ్, డిప్యూటి మేయర్ ముద్ర నారాయణ, కార్పొరేటర్ నరసింహ చారి, హాథిరాంజీ మఠం ఇంజనీర్, మునిసిపల్ కార్పోరేషన్ ఇంజనీర్లు, తిరుపతి తహశీల్దార్ సురేష్, నాయకులు, దుకాణదారులు పాల్గొన్నారు.

అంకురాలో చైల్డ్ డెవలప్‌మెంట్ సెంటర్ ప్రారంభం



ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: అంకురా హాస్పిటల్స్, ఆశ్రిత చైల్డ్ డెవలప్మెంట్ సెంటర్ సంయుక్త ఆధ్వర్యంలో తిరుపతిలో కొత్త చైల్డ్ డెవలప్మెంట్ సెంటర్‌ను తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, మేయర్ డాక్టర్ శిరీష, బాలకృష్ణ నాయక్ శనివారం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా ప్రతి చిన్నారికి సమయానుకూలమైన సహాయం అందేలా చేయడం దీని ప్రధాన లక్ష్యం అన్నారు. డెవలప్మెంటల్ స్క్రీనింగ్ అండ్ అసెస్మెంట్స్, స్పీచ్ అండ్ లాంగ్వేజ్ థెరపీ, ఆక్యుపేషనల్ థెరపీ, బిహేవియరల్, సైకాలజికల్ కౌన్సెలింగ్, పేరెంటల్ గైడెన్స్ అండ్ ఎర్లీ ఇంటర్వెన్షన్ ప్రోగ్రామ్స్ వంటి సేవలు చైల్డ్ డెవలప్మెంట్ సెంటర్ ద్వారా లభిస్తాయన్నారు. పిల్లల్లో మానసిక, శారీరక దుర్బలతలు నివారించేందుకు ఇవి ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. పీడియాట్రిక్ కు సంబంధించి అన్ని రకాల విభాగాలు ఇక్కడ అందుబాటులో ఉండడం దీని ప్రత్యేకత అన్నారు. ప్రారం భోత్సవం అనంతరం, ఏపియువై ఫౌండేషన్, ఆశ్రిత సీడీసీ సంయుక్తంగా నిర్వహించిన ఉచిత చైల్డ్ డెవలప్మెంట్ స్క్రీనింగ్ క్యాంప్‌లో పిల్లలకు నిపుణుల సలహాలు, డెవలప్మెంటల్, స్పీచ్, ఆక్యుపేషనల్, బిహేవియర్ సమస్యలపై ఉచిత పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌హౌస్ కన్సల్టెంట్ల డాక్టర్ రవి చందర్ (పీడ యాట్రిక న్యూరాలజిస్ట్), డాక్టర్ కె.కవిత, డాక్టర్ ఎస్. భారతి (చైల్డ్ అండ్ న్యూరో సైకియాట్రిస్ట్ కన్సల్టెంట్లు), డాక్టర్ వంశీ కృష్ణ (మెడికల్ డైరెక్టర్ అండ్ పీడియాట్రిషన్), డాక్టర్ పార్థ సారధి, డాక్టర్ రమణ, వైద్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఒక్క నెలలో శ్రీవారికి రూ. 918 కోట్లు

ట్రస్టుల రూపంలో వచ్చిన ఆదాయం

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో: తిరుమలేశుడిపై భక్తుల కానుకల వర్షం కురిపించింది. గత అక్టోబర్ 11 నెలల్లోనే టీటీడీ ట్రస్ట్‌లకు రూ.918 కోట్లకు పైగా విరాళాలు చేరాయి. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా దాతలు సమర్పిస్తున్న కానుకల వెల్లువతో స్వామి ఖజానా మరింతగా నిండిపోతోంది. ఈ కథనంలో పూర్తి వివరాలు తెలుసుకుందాం...

తిరుమల వెంకన్నకు ఉన్న బంగారం ఎంతో తెలుసా..?

తిరుమల శ్రీ వెంకటేశ్వరుడు అపర కుబేరుడు, బంగారు స్వామి. వెలకట్టలేని వజ్ర వైడూర్యాలు, వేల కోట్ల విలువైన ఆస్తులతో దేశ విదేశాల భక్తుల విశ్వాసానికి కేంద్రబిందువుగా ఉన్నాడు. ఇప్పుడు ఆ స్వామి ఆస్తుల విలువ మరింతగా పెరుగుతోంది. సామాన్యుడి నుంచి సంపన్నుడి దాకా ప్రతి భక్తుడు సమర్పించే కానుకలు, దాతలు ఇచ్చే విరాళాలు.. ఇవన్నీ తిరుమలేశుడి ఖజానాను నింపుతున్నాయి. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా అందుతున్న విరాళాల వెల్లువతో టీటీడీ ఆదాయం గణనీయంగా పెరిగింది. ఇప్పటికే టీటీడీ వద్ద సుమారు రూ. 21 వేల కోట్ల ఫిక్స్‌డ్ డిపాజిట్లు, దాదాపు 12 వేల కిలోల స్వచ్ఛమైన బంగారం జాతీయ బ్యాంకుల్లో డిపాజిట్‌గా ఉన్నాయి. అంటే గ్రాము పదివేల చొప్పున లెక్కకడితే రూ. 1.2 లక్షల కోట్లు ఉన్నట్లు అవుతుంది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఏర్పడిన కొత్త టీటీడీ పాలకమండలి పదవీ కాలం 11 నెలలు పూర్తవుతున్న వేళ.. ఈ వ్యవధిలోనే రికార్డు స్థాయిలో విరాళాలు చేరాయి. 2024 నవంబర్ 1 నుంచి 2025 అక్టోబర్ 16 వరకు భక్తులు, దాతలు టీటీడీ వివిధ ట్రస్ట్‌లకు సమర్పించిన విరాళాల మొత్తం రూ. 918.6 కోట్లు.



ట్రస్ట్‌లవారీగా పరిశీలిస్తే..

ఎస్వీ అన్నప్రసాదం ట్రస్ట్‌కు అత్యధికంగా రూ. 338.8 కోట్లు, శ్రీవాణి ట్రస్ట్ ద్వారా రూ. 252.83 కోట్లు, శ్రీ బాలాజీ ఆరోగ్య వరప్రసాదిని స్కీమ్‌కు రూ. 97.97 కోట్లు, ఎస్వీ ప్రాణదాన ట్రస్ట్‌కు రూ. 66.53 కోట్లు, ఎస్వీ గోసంరక్షణ ట్రస్ట్‌కు రూ. 56.77 కోట్లు, ఎస్వీ విద్యాదాన ట్రస్ట్‌కు రూ. 33.47 కోట్లు, బర్డ్ ట్రస్ట్‌కు రూ. 30.02 కోట్లు, ఎస్వీ సర్వశ్రేయస్ ట్రస్ట్‌కు రూ. 20.46 కోట్లు, ఎస్వీ వేదపరిరక్షణ ట్రస్ట్‌కు రూ. 13.87 కోట్లు, ఎస్వీబీసీకు రూ. 6.29 కోట్లు, స్విమ్స్‌కు రూ. 1.52 కోట్లు విరాళాలుగా అందాయి. వీటిలో ఆన్‌లైన్ ద్వారా రూ. 579.38 కోట్లు, ఆఫ్‌లైన్ ద్వారా రూ. 339.20 కోట్లు విరాళాలు చేరినట్లు టీటీడీ లెక్కలు వెల్లడిస్తున్నాయి.

భక్తులు, దాతల విశ్వాసానికి తగ్గ గౌరవం, సేవలు అందించడంలో ఎక్కడా లోటు లేకుండా టీటీడీ చర్యలు తీసుకుంటోందని అధికారులు చెబుతున్నారు. దాతల సహకారంతో ఆలయంలో పలు నిర్మాణాలు, యంత్రాల కొనుగోలు, సాంకేతిక అభివృద్ధి కార్యక్రమాలు కూడా వేగంగా కొనసాగుతున్నాయి.

తక్షణం ఉపాధి బిల్లులు చెల్లించండి



మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దాసరి జనార్ధన్

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: ఉపాధి హామీ పథకంలో పెండింగ్ బిల్లులను తక్షణమే చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దాసరి జనార్ధన్ డిమాండ్ చేశారు. స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో శనివారం వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సమావేశం జరిగింది. ఎనిమిది వారాలుగా బిల్లుల రాక వ్యవసాయ కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని జనార్ధన్ ఆవేదన చెందారు. తక్షణమే జిల్లా అధికారులు జోక్యం చేసుకొని కూలీలకు రావాల్సిన బకాయిలు చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. సామాజిక తనిఖీల్లో వస్తున్న అవినీతి ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి అక్రమార్కులపై కఠినమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఏడాదికి 200 రోజులు పని, రూ.600 రూపాయల వేతనం ఇవ్వాలని కోరారు. గ్రామీణ ప్రాంతాల్లో పేదలకు ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు మూడు సెంట్లు ఇంటి స్థలం, రూ. 5 లక్షలు ఇంటి నిర్మాణానికి మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాలో అసైన్మెంట్ భూములపై సమగ్ర విచారణ జరిపి అక్రమార్కుల చేతుల్లో ఉన్న డీకేటి భూములను పేదలకు పంచాలని సూచించారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు టి బాలకృష్ణ, ఉపాధ్యక్షులు నలుగూరి రమణయ్య, ఆముద, తిరుపాల్, బాల గురవయ్య, కృష్ణయ్య, శంకరయ్య, ముని శంకర్ తదితరులు పాల్గొన్నారు.

3న కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు దాఖలు చేసిన తమ అర్జీలు పరిష్కారం కాకపోయినా, లేదా తమ ఫిర్యాదులకు సంబంధించిన సమాచారం తెలుసుకోవడానికి 1100 నంబర్‌కు కాల్ చేయవచ్చునన్నారు. మీకోసం డాట్ ఏపీ డాట్ జివో వి డాట్ ఇన్ వెబ్సైట్‌లో వారి అర్జీలు నమోదు చేసుకోవచ్చున్నారు. 3 వ తేదీన కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.

శివయ్యను దర్శించుకున్న ఇస్రో చైర్మన్

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి :ఇస్రో చైర్మన్ నారాయణన్ శనివారం శ్రీకాళహస్తీశ్వరాలయానికి విచ్చేశారు. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ కొట్టే సాయి ప్రసాద్ సాంప్రదాయ స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. అనంతరం గురుదక్షిణామూర్తి ఆలయం వద్ద వేద పండితులు ఆశీర్వచనాలు పలకగా, కొట్టే సాయి ప్రసాద్ స్వామి అమ్మవార్ల తీర్థప్రసాదాలు, జ్ఞాపికలు అందజేశారు. నవంబర్ 2న ఇస్రో నుంచి తలపెట్టనున్న ఎల్వీఎం-3 ప్రయోగం విజయవంతం కావాలని ముక్కంటిని ప్రార్థించినట్లు నారాయణన్ తెలిపారు.

తుపాను నష్టం రూ.38 కోట్లు

- అంచనాల్లోనూ అంతంత మాత్రమే.!

ప్రజాశక్తి - తిరుపతి సిటీ:వారం రోజులు పాటు మొంథు తుఫాను రాష్ట్ర ప్రజానీకాన్ని వణికించింది. ఈ ఏడాదిలోనే అత్యంత బలమైన తుఫాన్ కావడంతో అధికారులు సైతం పరుగులు తీశారు. నిత్యం ప్రచార మాధ్యమాల ద్వారా ప్రజలను అప్రమత్తం చేశారు. ఎట్టికేలకు తుపాను తీరం దాటేసింది. తుఫాన్ ఎఫెక్ట్ వల్ల జిల్లాల్లో సుమారు 38 కోట్లు నష్టం వాటిల్లినట్లు అధికారులు అంచనాకు వచ్చారు. అంచనాలే అంతంతమాత్రంగా ఉంటే ఇక ప్రభుత్వ సహాయం ఎలా ఉంటుందో అర్థం కాని పరిస్థితి. నష్టాన్ని భర్తీ చేయడంలో అటు అధికార యంత్రాంగం ఇటు ప్రజాప్రతినిధులు నిమ్మకి నీరెత్తినట్లు వ్యవహరిస్తుండడం గమనార్హం.

గతవారం ఆంధ్రప్రదేశ్ అంతటా, ప్రతి ఇంట నిత్యం చర్చ జరిగిన అంశం మొంథా తుఫాన్. తుపాన్ ప్రభావంతో తిరుపతి జిల్లాలో సుమారు వారం రోజులు పాటు భారీ వర్షాలు పడ్డాయి. తుపాన్ తీరం దాటే వేళ దాన్ని ప్రభావం తీవ్రంగా ఉంటుందని వాతావరణ శాఖ అంచనా వేసింది. 26, 27, 28, 29 తేదీలలో భారీ నుంచి అతి భారీ వర్షాలు పడతాయని వెల్లడించింది. దీంతో తుపాన్ ప్రభావిత జిల్లాలలో అన్ని విద్యాసంస్థలకు సెలవులు ప్రకటించారు. అందులో తిరుపతి జిల్లా కూడా ఒకటి. ఇక్కడ 26, 27 తేదీల్లో భారీ వర్షాలు పడ్డాయి. 28వ తేదీ రాత్రి కాకినాడ - మచిలీపట్నం మధ్యలో తుఫాను తీరం దాటింది. 29వ తేదీ నుంచి తిరుపతి జిల్లాలో చుక్క చినుకు రాల లేదు. దీంతో 29వ తేదీ ముందుగా ప్రకటించిన విద్యాసంస్థల సెలవులను రద్దుచేసి యథా ప్రకారం పాఠశాలలు నడిపారు. జిల్లా అధికార యంత్రాంగం తుపాన్ నష్టాన్ని అంచనా వేసేందుకు పూనుకున్నారు. 30వ తేదీ మధ్యాహ్ననికి తుపాను వల్ల జిల్లాల్లో కలిగిన నష్టాన్ని అంచనా వేసి 38 కోట్ల 21 లక్షల రూపాయలుగా నిర్ధారించారు. అధికారుల అంచనా ప్రకారం జిల్లాలోని 19 మండలాలలోని 25 గ్రామాల్లో చాలా ఇబ్బంది జరిగింది. సుమారు 2000 మంది ప్రజలు దీనివల్ల నష్టపోయారు. జిల్లా వ్యాప్తంగా 94 హెక్టార్లలో పంట నష్టం, అందులో 92 హెక్టార్లు వరి పంట, 2 హెక్టార్లలో వేరుశెనగ పంటకు నష్టం జరిగింది. హార్టికల్చర్‌కు సంబంధించి 1.6 హెక్టర్లలో తొట్టంబేడు, బిట్ర గౌడ్ ప్రాంతాల్లో నష్టం జరిగింది. 21 ఇళ్లు పూర్తిగా ధ్వంసమయ్యాయి, 32 ఇళ్లు మరమ్మతులకు గురయ్యాయి. 12 పాకలు నేలమట్టమయ్యాయి. ఇందులో ఏర్పేడులో 5, తొట్టంబేడులో మూడు, రేణిగుంటలో ఒకటి, వడమాల పేటలో ఒకటి, శ్రీకాళహస్తిలో ఒకటి, ఆర్ సి పురంలో ఒకటి ఉన్నాయి. ఇళ్లు కూలిపోవడంతో 13 లక్షలు నష్టం జరిగింది. ఆర్ అండ్ బి కి సంబంధించిన 42 రహదారులు 129.12 కిలోమీటర్లు పొడవున దెబ్బతిన్నాయి. 6 రోడ్లు నీటమునిగాయి, 7 రోడ్ల దారి మళ్ళించారు. వాటి నష్టం రెండు కోట్ల 56 లక్షలు. పంచాయితీ రాజ్ పరిధిలో 70

రహదారులు 138.12 కిలోమీటర్ల రోడ్డు దెబ్బతింది. 10 బ్రిడ్జిలు, కల్వర్టర్లు దెబ్బతిన్నాయి. వాటి నష్టం రెండు కోట్ల 50 లక్షలు. మున్సిపాలిటీ పరిధిలో యుసిడీలు, పైప్ లైన్లు దెబ్బతిన్నాయి వాటి నష్టం 78 లక్షల 45వేలుగా నిర్ధారించారు. మైనర్ ఇరిగేషన్ పరిధిలో 32 కోట్ల 19 లక్షలు నష్టం వాటిల్లింది. ఏపీ ఎస్పీడీసీఎల్ పరిధిలో 33 కెవి లీడర్స్ 7, 33 బై 11 కెవి సబ్‌స్టేషన్లు 85, 11 కెవి పోల్స్ 93, ఎల్ టి పోల్స్ 39, 11 కెవి కండక్టర్స్ లైన్స్ 4.55 కిలోమీటర్లు, డి టి ఆర్ 113 దెబ్బతిన్నాయి. దీనివల్ల 57 లక్షల 50 వేలు నష్టం జరిగింది. 21 పెద్ద జంతువులు 52 చిన్న జంతువులు మృత్యువాత పడ్డాయి దీనివల్ల 14 లక్షల నష్టం. 785 పిహెచ్సిలు, సిహెచ్సిలు, సబ్ సెంటర్ల ద్వారా 816 వైద్య శిబిరాలు నిర్వహించారు. ఎస్బిఐఎఫ్ టీం ద్వారా 38 శిబిరాలు ఏర్పాటుచేసి 1678 మందికి ఆశ్రయం కల్పించారు. పదివేల 10,188 ఆహార పొట్లాలు, 15 వేల వాటర్ ప్యాకెట్లు పంపిణీ చేశారని జిల్లా కలెక్టర్ ప్రకటించారు. మొంథు తుఫాన్ కారణంగా తిరుపతి జిల్లాలో సుమారు 38 కోట్ల 21 లక్షల మేర నష్టం వాటిల్లిందని, ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధం చేశారు.

అంచనాలు కూడా అంతంత మాత్రమే..!

వారం రోజులు పాటు తిరుపతి జిల్లాలోని మెజార్టీ మండలాలు వర్షాల వల్ల అతలాకుతలమయ్యాయి. సముద్ర తీరాన ఉండే గ్రామాలు బాగా దెబ్బ తిన్నాయి. చాలా గ్రామాలకు రాకపోకలే లేని పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో హుటాహుటిన అధికారులు సమావేశమై తుఫాను నష్టం అంచనా 38 కోట్లుగా నిర్ధారించారు. 26, 27, 28, 29 తేదీలలో జిల్లాలో తుఫాన్ ప్రభావం ఉంది. అలాంటిది రాత్రికి రాత్రి నష్టాన్ని అంచనా వేసి 30వ తేదీ మధ్యాహ్ననికి జిల్లా కలెక్టర్‌కు నివేదిక సమర్పించడం గమనార్హం. సుమారు 300 కిలోమీటర్లు పొడవున రోడ్డు (రహదారులు) దెబ్బతింటే సుమారు రూ. 506.20 లక్షలు నష్టమని ప్రకటించడం దారుణం. వాస్తవానికి కిలోమీటర్ రోడ్డు నిర్మాణానికి 6 నుంచి 7 లక్షల రూపాయలు వ్యయం అవుతుంది. ఆ లెక్కన తుఫాను వల్ల పాడైన రోడ్లు బాగు చేయాలంటే, సుమారు 50 నుంచి 60 కోట్ల రూపాయలు నిధులు అవసరం. జిల్లా కేంద్రమైన తిరుపతిలోని ప్రధాన రహదారులైన బస్టాండు-అలిపిరి, పాత మున్సిపల్ ఆఫీస్ నుంచి భవాని నగర్ మీదుగా స్విమ్స్ వరకు, అలిపిరి -టౌన్ క్లబ్, బాలాజీ కాలనీ- వైకుంటపురం, యూనివర్సిటీ రోడ్డు, అన్నమయ్య సర్కిల్, తిరుచానూరు రోడ్డు ఇలా అన్ని ప్రధాన రహదారులు గుంతల మయమై, కంకర తేలిపోయి, వాహనదారులకు ఇబ్బంది కలిగిస్తున్నాయి. ఇలా వీటిని మరమ్మత్తులు చేయాలంటేనే సుమారు 10 కోట్లు పై మాటే. నష్ట తీవ్రత ఎలా ఉంటే అధికారుల అంచనా మాత్రం మరోలా ఉంది. అధికారులు పాత లెక్కల ప్రకారం అంచనాల వేసి, తూతూ మంత్రంగా నివేదిక సిద్ధం చేశారు. పైగా జరిగిన నష్టంపై ఇప్పటివరకు ఒకరంటే ఒక ప్రజాప్రతినిధి స్పందించలేదు. సహాయం చేయమని ప్రభుత్వాన్ని కోరిన దాఖలాలు లేవు. అటు అధికార యంత్రాంగం ఇటు ప్రజాప్రతినిధులు ఇద్దరూ నష్ట సహాయం పై ప్రభుత్వం వద్ద నోరు మెదపకపోవడం గమనార్హం. నివేదికలతో అన్నీ అమరతాయ అనుకుంటే సాధ్యమేనా...?, ఇప్పటికైనా అధికార యంత్రాంగం స్పందించి, వాస్తవ పరిస్థితులపై ఇప్పటి వ్యయాలకు తగ్గట్టుకు అంచనాలు సిద్ధం చేసి, త్వరతగతిన ప్రభుత్వం నుంచి సహాయం కోరి, బాధితులను ఆదుకోవాలని పలువురు ప్రజానీకం కోరుతున్నారు. ఆ దిశగా చర్యలు తీసుకుంటారని ఆశిద్దాం..!

మీ సేవలు శివాజీని మరిపించాలి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: మాజీ శ్రీకాళహస్తీశ్వరాలయ ఈవో శివాజీని మరిపించేలా మీ సేవలు ప్రజలకు అందించాలని మున్సిపల్ కమిషనర్ భవానీ ప్రసాద్‌కు ఎంజీఎం సంస్థల చైర్మన్ గుడ్లూరు మల్లికార్జున నాయుడు, డైరెక్టర్ మయూర్ విజ్ఞప్తి చేశారు. మున్సిపల్ కమిషనర్ భవానీ ప్రసాద్‌ను శనివారం వీరు సత్కరించారు. భవానీ ప్రసాద్ చిన్నాన్న అయిన శివాజీతో మల్లికార్జున నాయుడుకు ఉన్న అనుబంధాన్ని ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. స్కిట్ కాలేజీ రూపకల్పనలో శివాజీ ప్రాత్ర కొనియాడదగిందన్నారు. ఆయన అన్న కుమారుడుగా మీరూ ఆ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు.

ఈఎస్ఐ ఆసుపత్రి అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: డాక్టర్లు, సిబ్బంది, ఇతర ఉన్నతాధికారుల సహకారంతో తిరుపతి ఈఎస్ఐ ఆసుపత్రిని మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నట్లు మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ శ్యాంబాబు తెలిపారు. స్థానిక ఆర్‌సి రోడ్ లోని వంద పడకల ఈఎస్ఐ ఆసుపత్రిలో మెడికల్ సూపరింటెండెంట్‌గా బాధ్యతలు తీసుకొని ఏడాది పూర్తి చేసుకొన్న సందర్భంగా శనివారం డాక్టర్ శ్యాంబాబును ఆసుపత్రి డాక్టర్స్, సిబ్బంది సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎంఓ డాక్టర్ ఎవిఎస్ ప్రసాద్, స్పెషలిస్ట్ డాక్టర్స్ కె.పద్మావతి, సిహెచ్. జయంతి, భాగ్యలక్ష్మి, ఇతర డాక్టర్స్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పుత్తూరు అభివృద్ధికి సహకరించండి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : మున్సిపల్ కమిషనర్ మున్సిపల్ అత్యవసర సర్వసభ్య సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సమావేశంలో మున్సిపాలిటీలోని 27 వార్డులలో వివిధ అభివృద్ధి పనుల నిమిత్తం 2 కోట్ల రూపాయలు నిధులతో టెండర్లు ఆమోదించేందుకు నిర్ణయం తీసుకోవాల్సిఉంది. కానీ టెండర్ల ఆమోదించవద్దని మాజీ మంత్రి రోజా పుత్తూరు చైర్మన్ అనంగి హరికు తెలిపినట్లు, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ ఆనంద్ ఆరోపించారు. ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్‌కు మంచి పేరు రాకూడదనే రోజా ఈ ప్రయత్నం చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

క్యాట్‌కు ఎంపికైన శ్రీ చైతన్య విద్యార్థులు

జాశక్తి - కోట : జాతీయ స్థాయి పోటీ తత్వాన్ని విద్యార్థుల్లో పెంపొందించేందుకు నిర్వహించే ఒలంపియాడ్ నాలెడ్జ్ అసెస్మెంట్ టెస్ట్ (క్యాట్) ను కోట శ్రీ చైతన్య స్కూల్‌లో క్యాట్ లెవెల్ 1 పరీక్ష నిర్వహించారు. ఈ పోటీ పరీక్షలో కోట శ్రీ చైతన్య స్కూల్ సి బ్యాచ్ విద్యార్థులు 68 మంది అర్హత సాధించి, లెవెల్ 2కి ఎంపికయ్యారు. వారిని ఏజీఎం నర్రా శ్రీకాంత్, ఆర్ఐ కోట శ్రీనివాసులు, ప్రిన్సిపాల్ చిరంజీవి అభినందించారు. వారు 9 వ తేదీన నెల్లూరులో నిర్వహించే పరీక్షకు హాజరు కావాల్సి ఉంటుందని తెలిపారు. లెవెల్ 2 విజేతలకు నగదు బహుమతి, మెడల్స్, ప్రశంసా పత్రాలు అందిస్తారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జోనల్ డిన్ శివయ్య, జోనల్ పిజికల్ డైరెక్టర్ రాగూర్, బ్యాచ్ ఇంచార్జ్ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

రమణయ్యకు.. కోగిల సుబ్రమణ్యం నివాళి



ప్రజాశక్తి - శ్రీకాళహస్తి రూరల్ (తొట్టంబేడు): మండలంలోని కన్నలి గ్రామానికి చెందిన రమణయ్య అనారోగ్యంతో శనివారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న వైసీపీ, తొట్టంబేడు మండలాధ్యక్షులు కోగిల సుబ్రమణ్యం రమణయ్య భౌతిక కాయాన్ని సందర్శించి పూలమాలవేసి నివాళులు అర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యంగా ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో తాటిపర్తి సర్పంచ్ నాగేంద్ర వైయస్సార్ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

డిసెంబర్ 13న జాతీయ లోక్ అదాలత్

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : డిసెంబర్ 13 న జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహిస్తున్నట్లు పుత్తూరు మండల న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షులు, సీనియర్ సివిల్ జడ్జి ఎస్వీ రాఘవేంద్ర శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ రాజీ మార్గంలో కేసులు పరిష్కరించుకోవడం వల్ల సమయం, ధనం ఆదా అవుతుందన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించండి

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలోని బస్టాండ్ ఆవరణలో శనివారం ఎస్ఐ ఇన్స్పెక్టర్ హరి ప్రసాద్, (ట్రైనింగ్ ఎస్ఐ) సుధీర్ రెడ్డి తనిఖీలు నిర్వహించి, ట్రాఫిక్ నియంత్రించారు. హరి ప్రసాద్ మాట్లాడుతూ వాహన చోదకులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని తెలిపారు. లేని పక్షంలో కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్‌కు సన్మానం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : అమెరికా పర్యటన విజయవంతంగా ముగించుకుని, భారత దేశానికి తిరిగి వచ్చినన కార్పొరేషన్ డైరెక్టర్ గంజి మాధవయ్యను శనివారం రూరల్ పార్టీ అధ్యక్షుడు అరవ బాలాజీ, ప్రధాన కార్యదర్శి వెంకటేష్, రూరల్ ఉపాధ్యక్షులు విష్ణుల ఆయనను కలిసి సన్మానించారు.

ఆనందంతో చదవాలి

ప్రజాశక్తి - శ్రీకాళహస్తి (తొట్టంబేడు): మండలంలోని దిగువ సాంబయ్య పాళెం ప్రాథమిక పాఠశాలలో మొదటి శనివారం నో బ్యాగ్ డే సందర్భంగా విద్యార్థులు వివిధ రకాల కృత్యాలతో ఆనందంగా గడిపారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు కయ్యూరు బాలసుబ్రమణ్యం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒత్తిడి లేని అభ్యసనంతోనే విద్యార్థులు సర్వతోముఖాభివృద్ధి చెందుతారన్నారు.

ఓడ రేవును అడ్డుకున్నది చంద్రబాబే : చింతా

ప్రజాశక్తి - వాకాడు: వాకాడు మండలంలో శనివారం మాజీ కేంద్ర మంత్రి డాక్టర్ చింతామోహన్ నిరుద్యోగ భృతి గురించి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు కూటమి ప్రభుత్వ హామీలు నెరవేర్చలేదని, నిరుద్యోగ భృతి ఇవ్వలేదని ఆరోపించారు. ఈ ప్రాంతంలో రైతులు, నిరుద్యోగుల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం దుగరాజపట్నం పోర్టును ప్రభుత్వాన్ని ఒప్పించి రాష్ట్రపతి ఆమోదాన్ని తీసుకుని ప్రణాళికను సిద్ధం చేస్తే, చంద్రబాబు నాయుడు రాజకీయం చేసి ఓడరేవును రద్దుచేయించారని తెలిపారు. మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వం దుగరాజపట్నం పోర్టును ఇక్కడికి తీసుకువస్తామని హామీ ఇచ్చారు.

జగపతిరామయ్యకు అభినందన

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర వెటర్నరీ విశ్వవిద్యాలయానికి చెందిన కళాశాల అసోసియేట్ డీన్ ఆచార్య జగపతిరామయ్యకు ఆప్టాస్ నేతలు చినబాబు ఆధ్వర్యంలో అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆచార్య జగపతి రామయ్యకు అనాటమీ విభాగంలో 25 సంవత్సరాలకి అత్యుత్తమ పురస్కారం రావడం వర్సిటీకే గర్వకారణమన్నారు.

ఎస్వీయూ రెక్టార్‌గా ఆచార్య అప్పారావు



ప్రజాశక్తి - క్యాంపస్: ఎస్వీయూ నూతన రెక్టార్‌గా ఆచార్య సిహెచ్ అప్పారావును నియమిస్తూ ఎస్వీయు ఉపకులపతి ఆచార్య నరసింగరావు నియామక పత్రం అందజేశారు. రిజిస్ట్రార్ ఆచార్య భూపతి నాయుడు వారిని అభినందించారు.

నాడు ప్రభుత్వ భూమి.. నేడు పట్టా భూమి..! ఇదెట్టా..?



హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేస్తున్న దృశ్యం (ఫైల్ ఫోటో)

ప్రజాశక్తి - శ్రీకాళహస్తి రూరల్(తొట్టంబేడు): రాజు తలచుకుంటే కొరడా దెబ్బలకు కొదవా' అన్న చందంగా ఉంది మండల రెవెన్యూ అధికారుల తీరు. వీరు తలచుకుంటే ప్రభుత్వ భూమి అని బోర్డులు పెట్టించగలరు. అదే భూమికి పట్టాలు సృష్టించగలరనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. మండలంలోని శ్రీకృష్ణాపురం రెవెన్యూ పరిధిలో ఉన్న ప్రభుత్వ ఓ భూమిలో మూడు నెలల కిందట ఇది ప్రభుత్వ భూమి.. ఎవరూ ప్రవేశించరాదని రెవెన్యూ అధికారులు హెచ్చరిక బోర్డులు పెట్టించారు. మూడు నెలలు తిరిగే సరికి తూచ్..అవి దరఖాస్తు పట్టా భూములంటూ మాట మార్చేశారు. వివరాల్లోకి వెళితే శ్రీకృష్ణాపురం రెవెన్యూ సర్వే నెంబర్ 287-4, 288-1ఏ, 288-2లో సుమారు 6 ఎకరాల భూమి, ప్రభుత్వానిదని నిర్ధారిస్తూ మూడు నెలల కిందట అప్పటి తహశీల్దార్ మధుసూదన్ రావు రెవెన్యూ సిబ్బందిచే హెచ్చరిక బోర్డును నాటించారు. కానీ ప్రస్తుతం ఆ భూముల్లో కంచనపల్లికి చెందిన కొంతమందికి పట్టాలిచ్చినట్లుగా ఆరోపణలు వచ్చాయి. ఈ విషయంపై తహశీల్దార్ పి.భారతీని వివరణ కోరగా ఆ భూముల్లో 2012లోనే ఏడో విడత భూ పంపిణీ కింద డీకేటీ పట్టాలు ఇచ్చినట్లుగా రికార్డుల్లో నమోదైనట్లు వెల్లడించడం గమనార్హం.

గిరిజనులకు ప్రభుత్వ పథకాలు అందించడమే లక్ష్యం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గిరిజనులకు ప్రభుత్వ పథకాలను అందించడమే లక్ష్యమని జిల్లా ఎస్సీ, ఎస్టీ, అట్రాసిటీ సభ్యులు ఏసుపాక పెంచలయ్య పేర్కొన్నారు. శనివారం గూడూరు, తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ వెంకట ప్రసాద్ గిరిజనుల చిన్నారులకు ఆధార్ కార్డు నమోదు కొరకు స్థానిక ఆధారిత సర్టిఫికెట్లను మంజూరు చేశారు. ఈ సందర్భంగా గిరిజనులు తహశీల్దార్‌ను ఇంటిస్థలాలు కావాలని అడుగగా, ఆయన స్పందించి అధికారులకు ఇంటి స్థలాలు కేటాయించాలని తెలిపారన్నారు. అనంతరం గిరిజనులు తహసీల్దార్ ఆర్.వి ప్రసాద్, జిల్లా అట్రాసిటీ సభ్యులు ఏసుపాక పెంచలయ్యకి ధన్యవాదాలు తెలిపారు.

మహిళా బీసీసీఐ ప్రపంచ కప్పులో భారత్‌దే విజయం

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: ఉమెన్స్ బిసిసిఐ క్రికెట్ వరల్డ్ కప్ సెమీఫైనల్స్‌లో ప్రత్యర్థి ఆస్ట్రేలియా జట్టుపై ఘనవిజయం సాధించి ఫైనల్స్‌కు చేరుకున్న భారత మహిళా జట్టు నేడు జరిగే ఫైనల్ మ్యాచ్లో కూడా తప్పక విజయం సాధిస్తుందని ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్(ఏసిఏ) జాయింట్ సెక్రెటరీ విజయ్ కుమార్(క్రికెట్ విజయ్) ధీమా వ్యక్తం చేశారు. శనివారం అలిపిరి శ్రీవారి పాదాల చెంత మహిళా భారత జట్టు ప్రపంచ కప్ ఫైనల్స్ లో విజయం సాధించాలని ఏసీఏ జాయింట్ సెక్రెటరీ విజయ్ కుమార్ ఆధ్వర్యంలో కొబ్బరికాయలు కొట్టి మొక్కుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా అసోసియేషన్ అధ్యక్షులు శ్రీనివాస మూర్తి, కార్యదర్శి సతీష్ కుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

రాజీవ్ నగర్ బాధితులకు న్యాయం చేయాలి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: రాజీవ్ నగర్‌లో భూ బాధితులకు న్యాయం చేయాలని మాజీ కేంద్రమంత్రి చింతామోహన్ డిమాండ్ చేశారు. డాక్టర్ బత్తెయ్య నాయుడుతో కలిసి శనివారం చింతామోహన్ రాజీవ్ నగర్‌లో పర్యటించారు. 2007లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం పేదల కోసం 100 ఎకరాల ప్రభుత్వ స్థలం కేటాయించి, 7 వేల పట్టాలు ఇచ్చిందని గుర్తు చేశారు. ఇంటి నిర్మాణాల కోసం రుణాలు కూడా మంజూరు చేసిందని తెలిపారు. సుమారు 6 వేల మంది పక్కా గృహాలు నిర్మించుకున్నారని తెలియజేశారు. అయితే వైసిపి అధికారంలోకి వచ్చాక అవినీతి చోటుచేసుకుందనీ, ఆ నేతలు నొక్కేసిన డబ్బును తిరిగి పేదలకు పంచాలని డిమాండ్ చేశారు. రాజీవ్ నగర్ లో 300 మంది పేద ఇళ్ళు కూల్చే హక్కు కూటమి ప్రభుత్వానికి ఎవరు ఇచ్చారని ప్రశ్నించారు. టిటిడి తరహాలో శ్రీకాళహస్తీశ్వరాలయంలో జరుగుతున్న అవినీతిపై సిట్ తో దర్యాప్తు చేయించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నరేంద్ర నాయుడు, జనార్దన్ రెడ్డి, కూలి రవి కుమార్, సమీవుల్లా, పెద్ద కృష్ణయ్య వినోద్, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు

వ్యవసాయ ఉత్పత్తిదారుల సంఘాలతోనే మహిళా రైతుల అభివృద్ధి

ప్రజాశక్తి - రామచంద్రపురం : జిల్లాలో స్వయం సహాయక సంఘాలలోని మహిళా రైతుల అభివృద్ధికే ప్రభుత్వం వ్యవసాయ ఉత్పత్తిదారుల సంఘాలను ఏర్పాటు చేస్తుందని తిరుపతి జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ పథక సంచాలకులు పేర్కొన్నారు. శనివారం శ్రీ శక్తి భవనంలో మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించిన మహిళా రైతుల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ ఈ సంఘం ఏర్పాటుతో పండించిన పంటలకు రైతులే మార్కెటింగ్ చేసుకోవచ్చన్నారు. ఈకార్యక్రమంలో ఏపిఎం గురుమూర్తి, ఎఫ్‌పిఓ అధ్యక్షురాలు లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సాంబయ్య కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: విద్యుత్ షాక్‌తో మృతి చెందిన బుచ్చినాయుడు కండ్రిగ మండలం నీర్పకోట షిఫ్ట్ ఆపరేటర్ సాంబయ్య కుటుంబాన్ని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం శనివారం పరామర్శించారు. రూ.10 వేలు మట్టి ఖర్చులకు ఆర్థిక సాయం అందించి, విద్యుత్ శాఖ సీఎండీ శివశంకర్ టి మాట్లాడి ప్రభుత్వం ద్వారా అన్నీ విధాలుగా ఆదుకుంటామని సాంబయ్య భార్యకు ఉపాధి కల్పిస్తామని బరోసా కల్పించారు.

తొక్కిసలాటలో భక్తుల మృతి బాధాకరం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : శ్రీకాకుళం జిల్లా, కాశీబుగ్గ వేంకటేశ్వరస్వామి ఆలయంలో జరిగిన తొక్కిసలాట ఘటనలో 10 మంది మృతి చెందగా, పలువురికి గాయాలవడంపై వైసిపి ఉమ్మడి చిత్తూరు జిల్లా క్రియాశీల కార్యదర్శి రాకేష్ కిరణ్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతి చెందిన వారి కుటుంబాలకు సానుభూతి తెలిపారు. ప్రభుత్వం పరిహారం ఇవ్వాలని కోరారు.

ఎపిఎస్సిహెచ్‌ఈ వైస్ చైర్మన్‌ను కలిసిన నారాయణ గౌడ్

ప్రజాశక్తి - క్యాంపస్ : ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యా మండల వైస్ చైర్మన్ ఆచార్య ఎస్.విజయభాస్కర రావును బీసీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ పర్చూరు నారాయణగౌడ్ మంగళగిరిలోని వారి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. డాక్టర్ నారాయణ గౌడ్ మాట్లాడుతూ విద్యా పరిపాలనలో అనుభవం కలిగిన మంచి వ్యక్తి ప్రొఫెసర్ విజయభాస్కర రావు ఉన్నత విద్యా మండలి ఉపాధ్యక్షులుగా నియామకం కావడం శుభ పరిణామన్నారు.

రాధాకృష్ణకు మాతృ వియోగం

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కేతారి రాధాకృష్ణ మాతృమూర్తి కేతారి నరసమ్మ (103) శనివారం పరమపదించారు. సమాచారం అందుకున్న సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పి హరినాథ్ రెడ్డి, సిపిఎం జిల్లా కార్యదర్శి వి నాగరాజు, సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు కందారపు రపు మురళి , సిపిఎం నగర కార్యదర్శి పి వేణుగోపాల్ జిల్లా కార్యదర్శి పి మురళి, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎ రామానాయుడు, ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిన్నం పెంచలయ్య, నగర కార్యదర్శి జె విశ్వనాథ్, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు ఎన్ చంద్ర శేఖర్ రెడ్డి తదితరులు ఆమె పార్థీవ దేహానికి నివాళులు అర్పించారు. వారి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

రాష్ట్ర స్థాయి లాన్ టెన్నిస్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తిలోని విక్రం టెన్నిస్ అకాడమీ ఆధ్వర్యంలో శనివారం అండర్-14,17,19 రాష్ట్ర స్థాయి లాన్ టెన్నిస్ పోటీలను శాఫ్ చైర్మన్ రవి నాయుడు ప్రారంభించారు. రాష్ట్ర నలుమూలల నుంచి 390 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. క్రీడాకారులకు రవి నాయుడు ఆల్ ది బెస్ట్ చెప్పారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించే స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులు వచ్చే నెల ఢిల్లీలో జరిగే జాతీయస్థాయి పోటీలలో పాల్గొంటారని ఆంధ్రప్రదేశ్ స్కూల్ గేమ్ ఫెడరేషన్ కార్యదర్శి భానుమూర్తి తెలిపారు. పట్టణ టిడిపి అధ్యక్షులు విజయకుమార్, చెంచయ్య నాయుడు, శ్రీకాళహస్తి రోటరీ క్లబ్ కార్యదర్శులు బి జె ప్రసాద్, మన్మథ రావు, విక్రమ్ అకాడమీ చైర్మన్ ప్రవీణ్, జిల్లా స్కూల్ గేమ్ కార్యదర్శి కిషోర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఏపీ ఫారెస్ట్ సర్వీస్ అసోసియేషన్ ప్రెసిడెంట్‌గా రవినాయక్

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): ఆంధ్రప్రదేశ్ ఫారెస్ట్ సర్వీస్ అసోసియేషన్ ప్రెసిడెంట్‌గా అటవీశాఖ బయోట్రీమ్ పరిపాలన అధికారి రవి నాయక్ ఎన్నికయ్యారు. శనివారం తిరుపతి నగర పరిధిలోని కపిలతీర్థం అటవీ కాంప్లెక్స్‌లో అసోసియేషన్ తిరుపతి సర్కిల్ కు ఎన్నికలు నిర్వహించగా ప్రధాన కార్యదర్శిగా ఆనంద్, అసోసియేట్ అధ్యక్షులుగా గణేష్, కోశాధికారిగా భాగ్యరాజు, ఉపాధ్యక్షులుగా ఎం.సునీత, సంయుక్త కార్యదర్శిగా ఎస్.శ్రీకాంత్, కార్యనిర్వాహక కార్యదర్శిగా రమాదేవి, అసోసియేషన్ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారన్నారు. ఎన్నికల నిర్వాహణ ఏపీ ఎన్జీవో అధ్యక్షులు సురేష్ బాబు, లోకనాథ్ బాబు, రత్నం, తిరుమల బాబుల ఆధ్వర్యంలో జరిగిందన్నారు.

గ్రేటర్ తిరుపతిని స్వాగతిస్తున్నాం : జనసేన

ప్రజాశక్తి - చంద్రగిరి: గ్రేటర్ తిరుపతి ప్రతిపాదనను జనసేన పార్టీ స్వాగతిస్తూందని, అయితే ఈ విస్తరణలో కొన్ని సామాజిక, ఆర్థికంగా కీలకమైన గ్రామాలు మిస్సైనట్లు గుర్తించినట్లు చంద్రగిరి నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్చార్జ్ దేవర మనోహర్ పేర్కొన్నారు. ఈ అంశాన్ని ఆయన శనివారం జిల్లాకలెక్టర్ వెంకటేశ్వర్ దృష్టికి తీసుకెళ్లారు. సానుకూలంగా స్పందించిన కలెక్టర్ సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు వాకా మురళి, నాగశేషు, మురళి, ప్రసాద్, బాల తదితరులు పాల్గొన్నారు.

పోటీలలో ఎస్‌పిడబ్ల్యూ విద్యార్థినుల ప్రతిభ

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ పద్మావతి మహిళా జూనియర్ కళాశాల ద్వితీయ సంవత్సరం విద్యార్థినిలు బి ఢిల్సి, హెచ్ ఈ సి, ఎస్ దీక్షిత బైపీసి. తిరుపతి జిల్లా పోలీస్ స్మారక జ్ఞాపక వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన ప్రస్తుత సాంకేతికంలో సామాజిక మాధ్యమాల పాత్ర అనే అంశంపై వ్యాసరచన, వక్తృత్వ పోటీలలో జిల్లా స్థాయిలో ద్వితీయ స్థానాల్లో నిలిచి 3000 రూపాయల నగదు, ప్రశంసా పత్రం, మెమెంటోను జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు చేత శనివారం అందుకున్నారు.

'రాష్ట్ర అవతరణ' త్యాగానికి చిహ్నం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : తెలుగు ప్రజల ఐక్యతకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ దినోత్సవం చిహ్నంగా మిగిలిందని డాక్టర్ బి.చంద్రమౌళి పేర్కొన్నారు. శనివారం పుత్తూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రాష్ట్ర అవతరణ దినోత్సవ కార్యక్రమాలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ మన్యం నరసింహులు, సావిత్రి, డాక్టర్ బాబురావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాల అవినీతిని ఎండగడదాం

● సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు హరినాథ్ రెడ్డి

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : బిజెపి అధికారంలోకి వచ్చాక మతాలు, ప్రాంతాలు, భాషలు ఆహారం అలవాట్లు మధ్య చిచ్చుపెట్టి లబ్ధి పొందాలని ప్రయత్నిస్తోందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి హరినాథ్ రెడ్డి పేర్కొన్నారు. సిపిఐ నగర సమితి సమావేశం శనివారం స్థానిక గంధంనేని శివయ్య భవన్‌లో నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన హరినాథ్ రెడ్డి మాట్లాడుతూ పాకిస్తాన్‌ని గత ఎన్నికల్లో వాడుకున్నందుకు బీజేపీకి సీట్లు గణనీయంగా తగ్గిపోయాయన్నారు. ఎన్నికల హామీలను మోడీ అమలు చేయలేదన్నారు. రైతాంగ సమస్యలను పరిష్కారం చేయడం లేదని, కార్మిక చట్టాలను హరించి వేస్తున్నారని మండి పడ్డారు. ప్రజా పోరాటాలతో ప్రభుత్వ తీరును ఎండ గట్టాలంటే కమ్యూనిస్టులు చట్ట సభలలో అడుగు పెట్టాలన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేందుకు పార్టీ శ్రేణులు సిద్ధం కావాలన్నారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి పి మురళి, నగర కార్యదర్శి విశ్వనాథ్, సహాయ కార్యదర్శి బండి చలపతి, కార్యవర్గ సభ్యులు, సమితి సభ్యులు పాల్గొన్నారు.

గరుడ వారధిపై ప్రమాదాల నివారణకు చర్యలు

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: తిరుపతి, గరుడ వారధి ఫ్లైఓవర్‌పై ఇటీవల వాహన ప్రమాదాలు తరచుగా చోటుచేసుకోవడంతో, ప్రమాదాల నివారణ దిశగా జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు, కలెక్టర్ వెంకటేశ్వర్లు, మున్సిపల్ కమిషనర్ మౌర్యలు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఎస్పీ మాట్లాడుతూ ఫ్లైఓవర్ పై, మలుపుల వద్ద బ్లీకింగ్ సిగ్నల్ లైట్స్, హెచ్చరిక బోర్డులు, స్పీడ్ కంట్రోల్ సైన్ బోర్డులు, బారికేడ్లు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. రాత్రి సమయంలో స్పష్టంగా కనిపించేలా సూచికలను అమర్చి, వాహనదారులు నియంత్రిత వేగంతో, జాగ్రత్తగా ప్రయాణించేలా చర్యలు తీసుకుందామన్నారు. ట్రాఫిక్ పోలీసులు ప్రమాద ప్రాంతాల్లో పహారా ముమ్మరం చేయాలన్నారు. వాహన చోదకులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని తెలిపారు.

ఎస్‌కేఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా సింహాద్రి

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : స్థానిక ఎస్కేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా డాక్టర్ ఎం.సింహాద్రి బాధ్యతలు స్వీకరించారు. గతంలో పాణ్యం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేసి ఆయన, కమిషనర్ ఆఫ్ కాలేజీ ఏట్ ఎడ్యుకేషన్ ఉత్తర్వుల మేరకు ఎఫ్ఎసి ప్రిన్సిపాల్ డాక్టర్ వై. శ్రీనివాసులు నుండి బాధ్యతలు స్వీకరించారు.

మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను అడ్డుకుందాం

ప్రజాశక్తి - బాలాయపల్లి : కోటి సంతకాలతో ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణను అడ్డుకుందామని వైసీపీ మహిళా విభాగం నియోజకవర్గం అధ్యక్షురాలు కాటూరు రామతులసి పిలుపునిచ్చారు. శనివారం మండలంలోని మన్నూరు గ్రామంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

తహశీల్దారు జయజయరావుకు సీఎం ప్రశంస



ప్రజాశక్తి -కోట : తుఫాను సమయంలో సంసిద్ధత, సహాయక చర్యలలో అంకిత భావం, నాయకత్వం, అవిశ్రాంతి కృషికి, ఇలాంటి సవాలు సమయాలలో పౌరుల భద్రత, శ్రేయస్సును నిర్ధారించడంలో తహశీల్దార్ నిబద్ధత, సామర్థ్యం, కరుణకు గుర్తింపుగా ప్రజాసేవ యొక్క అత్యున్నత ప్రమాణాలకు ఉదాహరణగా ఈ ప్రశంసా పత్రం నిలుస్తుంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కోట తాహసిల్దార్ కే.జయ జయ రావు యొక్క ఆదర్శప్రాయమైన సహకారానికి హృదయపూర్వక ప్రశంసలు మరియు కృతజ్ఞతలు తెలియజేశారు. మొంతా తుఫాన్‌లో విధులు పట్ల నిర్లక్ష్యం చేయకుండా కోట మండలంలో దైవాలదిబ్బ, దొరువు కట్ట,కొత్తపట్నం,గూడలి,వాకాడు బ్యారేజీ,సమస్యాత్మకమైన పలు గ్రామాల్లో నిరంతర పర్యవేక్షణ చేయడమే కాకుండా ఎప్పటికప్పుడు అధికారులను, ప్రజలను అప్రమత్తం చేయడంలో అలుపెరగని పోరాటం చేయడంతో ప్రభుత్వం గుర్తించి గౌరవనీయులు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా.చంద్రబాబు నాయుడు చేతుల మీదగా శనివారం విజయవాడలో కోట తహశీల్దార్ కటారి జయ జయ రావు ప్రశంస పత్రాన్ని అందుకోవడం జరిగింది.ఈ మేరకు కోట తహసీల్దార్ కార్యాలయంలో రెవిన్యూ అధికారులు, జర్నలిస్టులు,పలువురు కలిసి భారీ గజ పూలమాల, శాలువాలతో సత్కరించి అభినందనలు తెలియజేశారు.

బంగారు కుటుంబాల పటిష్టతకు కార్యాచరణ చేయండి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: పి4 కార్యక్రమంలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ దత్తత తీసుకున్న కుటుంబాల పటిష్టతకు కార్యాచరణ రూపొందించాలని జాయింట్ కలెక్టర్ (ఇంచార్జి), నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య తెలిపారు. పి4 కార్యక్రమం పై శనివారం సాయంత్రం నగరపాలక సంస్థ కార్యాలయంలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ ఆర్.ఆర్.రెడ్డి, సెక్రటరీ శ్యాంబాబు, ప్రతినిధులతో కమిషనర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఇండియన్ మెడికల్ అసోసియేషన్ దత్తత తీసుకున్న 2వేల కుటుంబాల యొక్క పటిష్టతకు తగు చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ కమిషనర్ అమరయ్య, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, రెవిన్యూ ఆఫీసర్ సేతుమాధవ్, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ సభ్యులు డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ శ్రీకర్, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే విజయశ్రీకి సన్మానం



ప్రజాశక్తి - నాయుడుపేట: సూళ్లూరు పేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీని, నాయుడుపేట ఏఎంసీ చైర్మన్, సూళ్లూరుపేట నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్చార్జ్ ఉయ్యాల ప్రవీణ్‌లను పట్టణ టిడిపి నాయకులు కట్ట వెంకట రమణారెడ్డి సన్మానించారు. శనివారం ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ స్థానిక కూటమి పార్టీ నాయకులతో కలిసి నాయుడుపేట మున్సిపాలిటీ పరిధిలోని లోతువానిగుంటలో ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్లను పంపిణీ చేశారు. అలాగే నాయుడుపేట పిఎసిఎస్ గోదాంలో రైతులకు యూరియా బస్తాలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ, ఏఎంసీ చైర్మన్ ఉయ్యాల ప్రవీణ్‌లకు టీడీపీ నాయకులు కట్టా వెంకటరమణారెడ్డి సన్మానించారు. ఆమె చేసిన ప్రజా సేవలను కొనియాడారు.

అమ్మవారి బ్రహ్మోత్సవాలకు పటిష్ట ఏర్పాట్లు

ప్రజాశక్తి-తిరుపతి సిటీ: తిరుచానూరు శ్రీ పద్మావతీ అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాలు 17 నుండి 25వ తేదీ వరకు జరుగనున్న నేపథ్యంలో పటిష్ట ఏర్పాట్లు చేపట్టాలని టిటిడి జేఈవో వీ. వీరబ్రహ్మం అధికారులకు సూచించారు. తిరుపతి పరిపాలనా భవనంలోని సమావేశ మందిరంలో టిటిడి ఉన్నతాధికారులతో శనివారం ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జేఈవో మాట్లాడుతూ, భక్తుల రద్దీని ముందస్తుగా అంచనావేసుకుని అందుకుతగ్గట్లు వారం రోజుల ముందే ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. ఆలయం, పరసరాలు భక్తులను ఆకట్టుకునేలా అలంకరణ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో టిటిడి సీఈ టి.వి. సత్యనారాయణ, ఎఫ్ఎఅండ్ సీఏవో ఓ. బాలాజీ, తిరుచానూరు ఆలయ డిప్యూటీ ఈవో హరీంద్రనాథ్, ఐటి జీఎం డి. పణికుమార్ నాయుడు పలువురు డిప్యూటీ ఈవోలు, అర్చకులు బాబు స్వామి తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ

● పింఛన్ల పంపిణీలో తిరుపతి జిల్లా మొదటి స్థానం


ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రతా పింఛన్ల పంపిణీలో తిరుపతి జిల్లా 95.29 శాతం పంపిణీ చేసి రాష్ట్రంలోని మొదటి స్థానంలో నిలిచిందని, డిఆర్డిఏ ప్రాజెక్టు డైరెక్టర్ శోభన్ బాబు తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి సిబ్బంది పింఛన్లను పంపిణీ చేయడం జరిగిందన్నారు.

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పుత్తూరు పట్టణ పరిధి, స్థానిక 16 వ వార్డులో శనివారం లబ్దిదారులకు పెన్షన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వన్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్, టీడీపీ జిల్లా బీసీ సెల్ అధ్యక్షులు, క్లస్టర్ ఇంచార్జ్ షణ్ముగం రెడ్డి యూనిట్ ఇంచార్జ్, మాజీ మునిసిపల్ వైస్ చైర్మన్ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - కేవీబి పురం: శనివారం కేవిబి పురం మండలం, దిగువ పుత్తూరులో ఎన్టీఆర్ భరోసా పింఛన్లను లబ్దిదారులకు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అందచేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - రామచంద్రాపురం : శనివారం ఎన్టీఆర్ సామాజిక భద్రత పింఛన్లను ఒడ్డికాల్వలో డిఆర్డిఏ పిడి టిఎన్ శోభన్ బాబు అధ్వర్యంలో పంపిణీ చేశారు. ఆర్ సి పురం ఎస్టీ కాలనీలో చంద్రగిరి నియోజకవర్గ ప్రత్యేక అధికారి, తిరుపతి ఆర్డీవో రామ్మోహన్ లబ్ధిదారులకు పింఛన్ల పంపిణీ చేశారు.

ప్రజాశక్తి - వాకాడు: వాకాడులో ఎంపీడీవో సాయి ప్రసాద్ ఆధ్వర్యంలో శనివారం లబ్దిదారులకు సామాజిక పెన్షన్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.



ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు మండల పరిధిలోని, చెన్నూరులో శనివారం తిరు పతి పార్లమెంట్ తెలుగు మహిళ ప్రధాన కార్యదర్శి మట్టం శ్రావణీ రెడ్డి ఆధ్వర్యంలో లబ్దిదారులకు ఎన్టీర్ పెన్షన్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో చెన్నూరు నీటి సంఘం అధ్యక్షులు హేమంత్ రెడ్డి, ఇందుకూరు శ్రీకాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - శ్రీకాళహస్తి రూరల్(తొట్టంబేడు): చోడవరం పంచాయతీలో శనివారం అధికారులు, టీడీపీ నాయకులు లబ్దిదారులకు ఎన్టీఆర్ భరోసా పెన్షన్ అందజేశారు.

క్రైం న్యూస్

వీధి కుక్కల దాడిలో బాలుడికి గాయాలు



ప్రజాశక్తి - బాలాయపల్లి: వీధి కుక్కల దాడిలో రెండేళ్ల బాలుడు గాయాలపాలైన ఘటన మండలంలోని, కయ్యూరులో శనివారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన సుమన్, పుష్పల కుమారుడు నరసింహ ఇంటి ముందు వీధిలో ఆడుకుంటుండగా వీధి కుక్కలు దాడి చేశాయి. ఈ దాడిలో బాలుడికి తలపై, బుగ్గ పై గాయాలయ్యాయి. వీధి కుక్కల బెడదను తగ్గించాలని పంచాయతీ అధికారులకు పలుమార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోకపోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైనా కుక్కలను సంబంధిత అధికారులు నియంత్రించాలని కోరారు.

ఒంటరి మహిళ హత్య కేసులో ఇద్దరు అరెస్ట్



ప్రజాశక్తి - నాగలాపురం: తిరుపతి జిల్లా, నాగలాపురం మండల కేంద్రంలో ఒంటరి మహిళ హత్య కేసును పోలీసులు చేదించారు. ఈ కేసులో నిందితులైన ఇద్దరు భార్యాభర్తలను పోలీసులు అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు. పోలీస్‌లు తెలిపిన వివరాల మేరకు నాగలాపురం, బీసీ కాలనీలో ఒంటరి మహిళ ముని లక్ష్మి (55) నివసిస్తోందని తెలిపారు. గత నెల 25వ తేదీ శనివారం ఆమె హత్యకు గురైందన్నారు. ఇంట్లో నిద్రిస్తున్న ముని లక్ష్మిని గుర్తుతెలియని దుండగులు హత్య చేసి, ఆమె ఒంటిపై ఉన్న నగలను అపహరించుకుని వెళ్లారని తెలిపారు. స్థానికుల సమాచారం మేరకు ఎస్ఐ సునీల్ అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. ముని లక్ష్మికి దగ్గర బంధువులైన తిరుపతి జిల్లా, నారాయణవనం మండలం, ఉత్తరపు కండ్రిక గ్రామానికి చెందిన నీలి దుర్వాసులు, అతని భార్య, నీలి మునీశ్వరిని అదుపులో తీసుకుని విచారణచేయగా అసలు నిజం బయట పడిందన్నారు. ముని లక్ష్మి పట్టణంలో హోటల్లో పని చేసుకుంటూ జీవనం కొనసాగిస్తోందని తెలిపారు. ఆమె ఒంటిపై నగలపై కన్నేసిన నీలి దుర్వాసులు, అతని భార్య నీలి మునీశ్వరి గత నెల 24వ తేదీ మునిలక్ష్మీ ఇంటికి చుట్టం చూపుగా వచ్చారని తెలిపారు. ఆ రాత్రి ముని లక్ష్మీ ఇంట్లోనే బస చేసిన వీరు, వేకువజామున ముని లక్ష్మీని హత్య చేసి ఆమె ఒంటిపై ఉన్న ఒక బంగారు చైన్, కమ్మలు, ముక్కు పుడక, బీరువాలో దాచిన 2 బంగారు చైన్స్, 2 జతల కమ్మలు, ఒక జత మాటీలు, 2 ఉంగరాలు అపహరించుకుని వెళ్లారని తెలిపారు. దుర్వాసులు భార్య మునీశ్వరి నిద్రలో ఉన్న ముని లక్ష్మిని కదలకుండా కాళ్లు చేతులు పట్టుకోగా భర్త దుర్వాసులు ఆమెను గొంతు నులిమి చంపినట్టు విచారణలో వెల్లడిందని సీఐ మురళి తెలిపారు.

ఇసుక ట్రాక్టర్లు సీజ్

ప్రజాశక్తి - రేణిగుంట : రేణిగుంట మండలం, పిల్ల పాలెంలో శనివారం అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను తహశీల్దార్ చంద్రశేఖర్ రెడ్డి సీజ్ చేశారు. ఆయన మాట్లాడుతూ రేణిగుంట మండల పరిధిలో ఎక్కడైనా ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఆచార్య పేటశ్రీకి అభినందన

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య నరసింగరావు, రిజిస్ట్రార్ ఆచార్య భూపతి నాయుడులు యస్వీయూ తెలుగు అధ్యయన శాఖ పూర్వ ఆచార్యులు పేట శ్రీనివాసులు రెడ్డికి అభినందనలు తెలిపారు. సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాద్ వారు ఈ నెల 29వ తేదీ హైదరాబాద్ లో వారు రాసిన తిరుపతి కథలకు వచన సాహిత్య పురస్కారం అందించారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయం పూర్వ ఆచార్యుని విశ్వవిద్యాలయం అధికారులు శాలువాతో సత్కరించి అభినందించారు.

విజేతలకు అభినందనలు

ప్రజాశక్తి - క్యాంపస్ : పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా నిర్వహించిన తిరుపతి జిల్లా స్థాయి వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో, శ్రీవేంకటేశ్వర జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థులు వక్తృత్వ పోటీలో పాల్గొని జిల్లా స్థాయిలో మొదటి స్థానం లో పి.శశాంక్, సీనియర్ బై పి సి, మూడవ స్థానం లో డి. నిశాంత్ చక్రవర్తి, జూనియర్ ఎమ్ఈసి నిలిచారు. జిల్లా ఎస్పి ఎల్. సుబ్బా రాయుడు నుంచి మొదటి బహుమతిగా రూ. 5,000, మూడవ బహుమతి క్రింద రూ. 2,000 నగదును, ప్రశంసా పత్రాలు అందుకొన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ సి. ప్రకాష్ బాబు, అధ్యాపకులు విజేతలను అభినందించారు.

పిల్లల పండుగ బాలోత్సవం: డాలర్స్



ప్రజాశక్తి - తిరుపతి టౌన్: పిల్లల పండుగ బాలోత్సవం అని తుడా చైర్మన్ దివాకర్ రెడ్డి పేర్కొన్నారు. ఎస్ఎస్ ఆర్ట్స్ కాలేజ్‌లో జరిగిన కార్యక్రమానికి దివాకర్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలోత్సవం పిల్లల్లోని ప్రతిభను వెలికితీయడానికి అద్భుతమైన వేదిక అన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు డాలర్స్ దివాకర్ రెడ్డిని మెమెంటోతో సత్కరించారు.

వర్సిటీలో మూడేళ్ల లా కోర్స్ ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయానికి నూతన వైస్‌చాన్సలర్‌గా ఎన్నికైన ప్రొఫెసర్ టాటా నరసింగరావును శనివారం ఎన్ఎల్ఎస్ఏ వ్యవస్థాపకులు సుందర్ రాజు మర్యాదపూర్వకంగా కలిశారు. విశ్వవిద్యాలయంలో 3 సంవత్సరాల లా కోర్సును ప్రారంభించి పేద విద్యార్థులకు న్యాయ విద్యను అందుబాటులోకి తేవాలని వీసీని కోరారు. ఎల్ఎల్ఎం కోర్సులో ఇంటెలెక్చువల్ ప్రాపర్టీ లా, క్రిమినల్ లా, కార్పొరేట్ లా, కంపెనీ లా వంటి ప్రత్యేక విభాగాలను ఏర్పాటు చేయాలని కోరారు.

కాళిదాసు జయంతి

ప్రజాశక్తి - క్యాంపస్ : జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో సాహిత్య విభాగం తరపున కాళిదాస విగ్రహం ఎదుట విసి ఆచార్య కృష్ణ మూర్తి ఆధ్వర్యంలో మహాకవి కాళిదాసు జయంతి మహోత్సవాన్ని శనివారం అత్యంత వైభవంగా నిర్వహించారు.